

ఆదర్శ పాఠశాలలో అధికారుల తనిఖీ

దుబ్బాక, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): దుబ్బాక మున్సిపల్ లచ్చపేట ఆదర్శ పాఠశాలను మంగళవారం మండల అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని వంటగది, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. నాణ్యమైన ఆహారం అందిస్తున్నారా.. అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అలాగే సీఎం కప్ కోసం క్రీడా మైదానాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో దుబ్బాక తహసీల్దార్ సంజయ్‌కుమార్, ఎంపీడీవో భాస్కరశర్మ, దుబ్బాక సీఐ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ రమేష్ పాల్గొన్నారు.

ఏడాదైనా ఎదురుచూపులే

- పదవుల కోసం కాంగ్రెస్ నేతల నిరీక్షణ
- కార్పొరేషన్ పోస్టుల్లోనూ జిల్లాకు మొండిచెయ్యి
- 'సుడా', పలుమార్కెట్, దేవాలయ కమిటీల్లో జాప్యం
- గ్రూపు రాజకీయాలతోనే పదవులు దూరం!
- సీఎం, మంత్రులు, ముఖ్యనాయకుల పేరిట వర్గాలు

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక సంగారెడ్డి జిల్లాకు సంబంధించి ముగ్గురిని కార్పొరేషన్ చైర్మన్ పదవులు వరించాయి. సిద్దిపేట జిల్లాకు ఒక్క పోస్టు కూడా దక్కలేదనే నిరాశనిస్పృహలు స్థానికంగా నెలకొన్నాయి. రాష్ట్రస్థాయి పదవులే కాదు. జిల్లా స్థాయిలోని నామినేటెడ్ పదవుల పంపకంలోనూ జాప్యం జరుగుతోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పలుచోట్ల మార్కెట్ కమిటీలను నియమించినప్పటికీ ఇంకనూ ప్రకటించాల్సి ఉంది. సిద్దిపేట అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(సుడా) పాలకవర్గ నియామకం అలస్యమే అవుతోంది. కాంగ్రెస్ పార్టీలో ఉన్న గ్రూపు రాజకీయాలే ఇందుకు ప్రధాన కారణాలుగా నిలుస్తున్నాయి.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, డిసెంబరు 10



పదేళ్లపాటు అధికారానికి దూరంగా ఉన్న కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు పదవుల కోసం ఆశలు పెట్టుకున్నారు. గ్రామపంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు వాయిదా పడడంతో నామినేటెడ్ పోస్టులైనా దక్కుతాయని చూస్తున్నారు. వచ్చే జనవరిలో మున్సిపాలిటీ పాలకవర్గాల గడువు సైతం పూర్తవుతుంది. ఈ ఎన్నికలను కూడా సమయానికి నిర్వహించకుంటే మరింత మంది ఆశావహులు పదవుల రేసులోకి చేరుతారు. రెండేళ్ల కాలానికి ఏదో ఒక పోస్టు దక్కించుకోవాలని కాంగ్రెస్ ముఖ్యనేతల చుట్టూ రోజూ ప్రదక్షిణలు చేసేవారి సంఖ్య వందల్లో ఉందంటే అతిశయోక్తి కాదు.

మార్కెట్లు, దేవాలయ కమిటీలేవి?

వ్యవసాయ మార్కెట్‌కమిటీలకు రెండేళ్ల పదవీ కాలం ఉంటుంది. ఇప్పటికే ఏడాది గడిచింది. కనీసం ఇప్పుడైనా నియమిస్తే రెండు దఫాలుగా తమకు పదవులు దక్కుతాయని కాంగ్రెస్ నేతలు విన్నవిస్తున్నారు. గజ్వేల్, హుస్నాబాద్, కోహెడ చేర్యాల వ్యవసాయ మార్కెట్లతోపాటు కొమురవెల్లి, కొండపోచమ్మ ఆలయాలకే నూతన కమిటీలను నియమించారు. సిద్దిపేట, నంగునూరు, చిన్నకోడూరు, దుబ్బాక, మిరుదొడ్డి, దౌల్తాబాద్, తొగుట, కొండపాక, వంటిమామిడి వ్యవసాయ మార్కెట్ల కోసం తయారు చేసిన జాబితాల్లో అనేక సవరణలు జరుగుతున్నాయి. రేపు మాపు అంటూ ఏడాది గడిచినా కొత్త కమిటీలను నియమించలేదనే భావన నెలకొన్నది. ఇక నాచారం, కూడవెల్లి రామలింగేశ్వర, రేకులకుంట మల్లికార్జునస్వామి, సిద్దిపేటలోని బుగ్గ రాజేశ్వర, సంతోషిమాత, వెంకటేశ్వర, శరబేశ్వర తదితర ఆలయాల పాలకవర్గాలకూ పోటీ ఉంది. ఇవికాకుండా ఆత్మకమిటీలనూ నియమించాల్సిందిగా కోరుతున్నారు.

'సుడా'పై వీడని ఉత్కంఠ..

గతంలో సిద్దిపేట పట్టణ పరిసర గ్రామాలకే పరిమితమైన సిద్దిపేట అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(సుడా)ని ప్రస్తుతం జిల్లా అంతటా విస్తరించారు. దీంతో జిల్లాలోని కాంగ్రెస్ ముఖ్య నేతలంతా సుడా కమిటీలో చైర్మన్, డైరెక్టర్ పదవులను ఆశిస్తున్నారు. ఆదాయంతోపాటు ప్రొటోకాల్ వర్తించే ఈ పదవులకు తీవ్రమైన పోటీ నెలకొంది. ప్రస్తుతం సుడా పాలకవర్గ ఆశావహుల జాబితా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వద్ద ఉన్నట్లు సమాచారం. ఆయన నిర్ణయం మేరకే

మిగతా 8వ పేజీలో...



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

సీఎం కప్ క్రీడలను విజయవంతం చేయాలి

- కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట కలెక్టరేట్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అన్నిశాఖల అధికారులు సమన్వయంతో సీఎం కప్ క్రీడలను విజయవంతం చేయాలని కలెక్టర్ మనుచౌదరి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో క్రీడాశాఖ, జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించి సీఎం కప్ క్రీడల నిర్వహణపై చర్చించి తగు ఆదేశాలు జారీచేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామీణ క్రీడాకారుల ప్రతిభను వెలికితీయడానికి ఈనెల 7, 8 తేదీల్లో పంచాయతీ స్థాయిలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడలను నిర్వహించినట్లు చెప్పారు. మంగళవారం నుంచి ప్రారంభమైన మండలస్థాయి పోటీలు 12 వరకు జరుగుతాయని చెప్పారు. ఇందులో సత్తాచాటిన వారు 17, 18, 19 తేదీల్లో సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానం, స్పోర్ట్స్ స్టేడియంలో జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. అక్కడ ప్రతిభ కనబర్చిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని చెప్పారు. ఈ మేరకు క్రీడాపోటీల నిర్వహణకు ఎలాంటి ఇబ్బందులూ రాకూడదని ఆయన సూచించారు. తాగునీరు, మరుగుదొడ్లు, భోజన వసతి, పీఈటీలను, క్రీడాసామగ్రిని సమకూర్చడం, మెడికల్ క్యాంపు తదితర ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ మనుచౌదరి అధికారులకు సూచించారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి, డీఆర్వో నాగరాజమ్మ, డీఆర్డీఏ, జిల్లా క్రీడల అధికారి జయదేవ్ ఆర్యా, డీపీవో దేవకీదేవి, జడ్పీ సీఈవో రమేష్, డీఈవో శ్రీనివాస్ రెడ్డి, డీఎంహెచ్‌వో పల్వాన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

బదిలీలకు బేరసారాలు!

- సొంత జిల్లాలకు వెళ్లేందుకు ఉపాధ్యాయుల సంప్రదింపులు
- టీచర్ల మధ్య ఆర్థిక లావాదేవీలు?
- 317 జీవోతో నష్టపోయిన వారికి 'పరస్పర' వెసులుబాటు
- ఈ నెల 30 వరకు దరఖాస్తునకు గడువు



కొండపాక, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): టీచర్లు, ఉద్యోగుల మ్యూచువల్ బదిలీలకు సిద్దిపేట జిల్లాలో బేరసారాలు మొదలయ్యాయి. జీవో 317 కారణంగా నష్టపోయిన ఉపాధ్యాయులకు ప్రభుత్వం తాజాగా స్పౌజ్, అనారోగ్యం, పరస్పర బదిలీలకు అనుమతి ఇచ్చిన విషయం తెలిసిందే. ఈనెల 30 వరకు దరఖాస్తు చేసుకునేందుకు గడువు ఇచ్చింది. పరస్పర బదిలీ కోరుకుంటున్న ఇద్దరిలో ఒకరు జీవో 317 ద్వారా నష్టపోయిన వారై ఉండాలన్న నిబంధన ఉన్నది. ఇద్దరి సమ్మతితోనే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. పరస్పర బదిలీకి సిద్ధమయ్యే వారి కోసం ఉపాధ్యాయులు అన్వేషిస్తున్నారు. ఈ క్రమంలో ప్రాంతాన్ని బట్టి రూ.5లక్షల నుంచి రూ.10లక్షల వరకు బేరసారాలు నడుస్తున్నట్లు పలువురు ఉపాధ్యాయులు చెబుతున్నారు. గతంలో కూడా ప్రభుత్వం అవకాశం ఇవ్వగా దాదాపు రూ.10లక్షల వరకు చెల్లించిన వారు ఉన్నారు. ఈసారి కూడా అలాంటి ప్రయత్నాలు సాగుతున్నట్లు సమాచారం. ఉద్యోగులకు ఉపాధ్యాయులకు సదవకాశం అయినప్పటికీ ఎక్కువశాతం ఉపాధ్యాయులే ఈ ప్రయత్నాలు సాగిస్తున్నారు.

ఎవరికి వారు ప్రయత్నాలు

కొత్త జిల్లాలు, జోన్ల ప్రాతిపదికన ఉద్యోగులు, టీచర్లను అలాట్ చేసేందుకు గత ప్రభుత్వం 317 జీవోను తీసుకొచ్చింది. సీనియర్లు అంతా సొంత జిల్లాలోనే ఉండగా జూనియర్లు ఇతర జిల్లాలకు వెళ్లాల్సి వచ్చింది. 317 జీవోతో ఎంతో నష్టపోయామని వారు పలుమార్లు ఆవేదన చెందారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు జీవో 317పై కమిటీ వేసి అందుకు అనుగుణంగా రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు స్పౌజ్, మెడికల్‌లతో పాటు మ్యూచువల్ బదిలీలకు అనుమతినిచ్చింది.

ఉద్యోగ విరమణకు దగ్గర ఉన్నవారు

మరో రెండేళ్లలో ఉద్యోగవిరమణ పొందేవారు ఆర్థిక ఇబ్బందులతో ఇతర ప్రాంతాలకు వెళ్లడానికి బేరసారాలు సాగిస్తున్నట్లు సమాచారం. ఎలాగైనా మరో రెండు సంవత్సరాల్లో ఉద్యోగ విరమణ పొందుతుండడంతో ఎక్కడైనా సరే ఉద్యోగం చేయడానికి సిద్ధంగా ఉన్నామంటూ ప్రయత్నాలు చేసుకుంటున్నారు. పిల్లల ఉన్నత చదువుల కోసం అధికంగా డబ్బు వెచ్చించడం, ఆర్థిక ఇబ్బందులు ఉన్నవారు మెదక్ ఇతర ప్రాంతాలకు వెళ్లడానికి ప్రయత్నాలు చేసుకుంటున్నారు. ఎక్కువ ఎవరైతే డబ్బు ఇస్తారో వారికి కమిట్‌మెంట్ ఇస్తున్నట్లు తెలిసింది.

సిద్దిపేట జిల్లా హాట్‌కేక్

జీవో 317 వల్ల సిద్దిపేట జిల్లాకు చెందిన చాలామంది ఇతర జిల్లాలకు వెళ్లారు. సిద్దిపేట పరిసర ప్రాంతాల్లోని వారు వారి ఆర్థిక పరిస్థితుల కారణంగా ఇతర ప్రాంతాలకు వెళ్లడానికి సిద్ధంగా ఉన్నారు. బదిలీపై వెళ్లిన వారు సిద్దిపేటకు రావడానికి పెద్దమొత్తంలో చెల్లించడానికి సిద్ధమవుతున్నట్లు తెలిసింది.

సాధారణ ఉపాధ్యాయుల మాటేమిటి

317 జీవో ప్రకారం ఇతర జిల్లాలకు వెళ్లిన సాధారణ ఉపాధ్యాయుల పరిస్థితి ఎటూకాకుండా ఉంది. ప్రభుత్వం కేవలం మ్యూచువల్, మెడికల్, స్పౌజ్ మాత్రమే అవకాశం ఇవ్వడంతో ఆ తరహా ఏం లేని వారు మా పరిస్థితి ఏంటని వాపోతున్నారు. జీవో 317 ప్రకారం దాదాపు 500 మందికి పైగానే సిద్దిపేట జిల్లా నుంచి ఇతర జిల్లాలకు వెళ్లారు. ఇందులో స్పౌజ్ సుమారు 200 వరకు ఉంటారు. మెడికల్‌లో 50 వరకు ఉండవచ్చు. మిగతా వారంతా స్థానికతను కోల్పోయి ఇతర జిల్లాలో ఉన్నారు. తమకు కూడా స్థానికత ఆధారంగా జిల్లాకు బదిలీ చేసుకునే అవకాశం ఇవ్వాలని పలువురు ఉపాధ్యాయులు కోరుతున్నారు. అయితే, ఈనెల చివరి వరకు వరకు అవకాశం ఇచ్చినప్పటికీ విద్యాశాఖలో ఇప్పటి వరకు ఎలాంటి జాబితా తయారు రాలేదనే సమాచారం.

ఐఐటీ-హెచ్‌లో అంతర్జాతీయ సదస్సు

- ఆరోగ్యంపై జీవనప్రక్రియల ప్రభావం మీద చర్చలు



6

విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్న సర్కార్

- బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాయిబాబా
- ఉద్రిక్తం.. బీసీ సంఘం నాయకుడి అరెస్టు



7

ఆశ కార్యకర్తల ముందస్తు అరెస్టు


- సంఘీభావం తెలిపిన బీఆర్ఎస్ నేతలు
- అరెస్టును ఖండించిన సీఐటీయూ నాయకులు



8

బొమ్మ వెంకటేశ్వర్లు సేవలు చిరస్మరణీయం

- ఆయన మార్గదర్శకం అనుసరణీయం : మంత్రి పొన్నం ప్రభాకర్
- ఆయన ఆశయ సాధనకు కృషి చేద్దాం : చాడ వెంకటరెడ్డి



హుస్నాబాద్‌లోని నాగారం రోడ్డులో బొమ్మ వెంకటేశ్వర్లు విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ ప్రాంతానికి మాజీ ఎమ్మెల్యే దివంగత బొమ్మ వెంకటేశ్వర్లు చేసిన సేవలు చిరస్మరణీయమని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మంగళవారం రాత్రి ఆయన హుస్నాబాద్‌లోని నాగారం రోడ్డులో ఏర్పాటు చేసిన బొమ్మ వెంకటేశ్వర్లు విగ్రహాన్ని ఆవిష్కరించిన అనంతరం జరిగిన సమావేశంలో మాట్లాడారు. బొమ్మ వెంకన్న ఎంతో మందికి రాజకీయ గురువు అని, ఆయన చేసిన అభివృద్ధి, చూపిన ప్రేమ, అభిమానాలు అనుసరణీయమన్నారు. ఇదే చౌరస్తాలో మాజీ ఎమ్మెల్యేలు దివంగత దేశిని చినమల్లయ్య, బొప్పరాజు లక్ష్మీకాంతారావు, బద్దం ఎల్లారెడ్డి విగ్రహాలను కూడా ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ బొమ్మ వెంకటేశ్వర్లు ఈ ప్రాంత సమగ్ర అభివృద్ధిని కోరుకున్నాడని, ఆయన ఆశయ సాధనకు అందరం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ హాజ్‌ఫెడ్ చైర్మన్, వెంకటేశ్వర్లు కుమారుడు బొమ్మ శ్రీరాంచక్రవర్తి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ లింగమూర్తి, డీసీసీ ప్రెసిడెంట్ నర్సారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య వైస్ చైర్మన్ అనిత, పలువురు పాల్గొన్నారు.

క్రీడలకు ప్రభుత్వం ప్రోత్సాహం

విద్యతోపాటు క్రీడలు జీవితంలో భాగస్వామ్యం కావాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మంగళవారం ఆయన హుస్నాబాద్‌లోని మినీ స్టేడియంలో మున్సిపల్ ఆధ్వర్యంలో జరిగిన సీఎం కప్ క్రీడాపోటీల ప్రారంభోత్సవానికి హాజరై మాట్లాడారు. క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం అనేక రకాలుగా ప్రోత్సహిస్తుందని తెలిపారు. ప్రభుత్వం యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీని తీసుకొస్తుందని చెప్పారు. అందులో హుస్నాబాద్ నుంచి పెద్దఎత్తున విద్యార్థులు చేరాలని, అందుకు వ్యాయామ ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. జాతీయస్థాయిలో ఆడిన విద్యార్థులకు రూ.లక్ష బహుమానం అందిస్తానని ఆయన పేర్కొన్నారు.

అది కాంగ్రెస్ తల్లి విగ్రహం

- బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే గాంధీభవన్‌కు తరలిస్తాం
- ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్

సిద్దిపేటటౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ తల్లిని అవమానపరిచిన అత్యంత దుర్మార్గుడు సీఎం రేవంత్‌రెడ్డి అని ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ తల్లి విగ్రహం మార్పు, బతుకమ్మను తొలగించడంపై బీఆర్ఎస్ పిలుపు మేరకు మంగళవారం సిద్దిపేట అంబేడ్కర్ చౌరస్తాలోని మోడల్ బస్టాండ్ వద్ద భారీ ధర్నాను నిర్వహించారు. ఈ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు నినదించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ మాట్లాడారు. 20 ఏళ్ల క్రితమే కేసీఆర్ తెలంగాణ తల్లి విగ్రహానికి రూపకల్పన చేశారని, ఆ విషయం కాంగ్రెస్ దుర్మార్గులకు తెలియదని ఎద్దేవా చేశారు. కేసీఆర్ సీఎం అయిన తర్వాత ఎమ్మెల్యేలను కొనుగోలు చేసేందుకు రేవంత్‌రెడ్డి బ్యాగు బాబ్జీగా అవతారమెత్తిన విషయం అందరికీ తెలుసన్నారు. రేవంత్‌రెడ్డి సచివాలయంలో ఏర్పాటు చేసింది తెలంగాణ తల్లి విగ్రహం కాదని, అది కాంగ్రెస్ తల్లి విగ్రహమన్నారు. బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే రేవంత్ ఏర్పాటు చేసిన కాంగ్రెస్ తల్లి విగ్రహాన్ని మేళతాళాలు, డప్పుచప్పుళ్లతో గాంధీభవన్‌కు తరలిస్తామని తెలిపారు. కాంగ్రెస్ హామీలను ప్రశ్నిస్తున్న మంత్రులు, ఎమ్మెల్యేలపై అక్రమ కేసులు బనాయించి అరెస్టులు చేస్తున్నాడని మండిపడ్డారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, నాయకులు కొండం సంపత్‌రెడ్డి, రాజనర్సు, రాధకృష్ణశర్మ, పాల సాయిరాం, కౌన్సిలర్లు మల్లికార్జున్, నాగరాజురెడ్డి, బీఆర్ఎస్‌కేవీ జిల్లా అధ్యక్షుడు పిండి అరవింద్ తదితరులు పాల్గొన్నారు.



సిద్దిపేటలో చేపట్టిన ధర్నాలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్

బతుకమ్మ ఆడిన మహిళలు

తెలంగాణ తల్లి చేతిలో ఉన్న బతుకమ్మను తొలగించడం పట్ల మహిళా లోకం ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ జడ్పీ చైర్మన్ రోజశర్మ, మున్సిపల్ చైర్మన్ మంజుల రాజనర్సు, మాజీ ఎంపీపీ శ్రీదేవి, పట్టణ కౌన్సిలర్లు మహిళ నాయకుల ఆధ్వర్యంలో మహిళలు బతుకమ్మ ఆడి నిరసన వ్యక్తం చేశారు. బతుకమ్మ ఆట పాటలతో ఉద్యమ సందర్భాల మాదిరిగా నిరసన వ్యక్తం చేశారు.

పోలింగ్ కేంద్రాలపై అభ్యంతరాలుంటే తెలియజేయాలి

సిద్దిపేటకలెక్టరేట్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ ఎన్నికల కోసం జిల్లాలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలపై ఏమైనా అభ్యంతరాలుంటే తెలియజేయాలని అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. మంగళవారం కలెక్టరేట్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించారు. మొత్తంగా 4,350 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తూ జాబితాను గ్రామ పంచాయతీలలో ప్రదర్శించినట్లు చెప్పారు. ఈ నెల 12న మండల కేంద్రాల్లో ఎంపీడీవోలు మండలస్థాయి రాజకీయపార్టీలతో సమావేశం నిర్వహిస్తారని తెలిపారు. ఏమైనా అభ్యంతరాలుంటే తెలియజేస్తే అవసరమైన మార్పులు, చేర్పులు చేస్తామని తెలిపారు. సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి దేవకీదేవి, జడ్పీసీఈవో రమేష్, డీఎల్పీవో మల్లికార్జున్, రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-2 పరీక్ష పకడ్బందీగా నిర్వహించాలి

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే గ్రూప్-2 పరీక్ష అభ్యర్థులు ప్రశాంత వాతావరణంలో రాసేలా అన్ని ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో 37 సెంటర్లలో 13,714 మంది అభ్యర్థులు గ్రూప్-2 పరీక్ష రాయనున్నారని తెలిపారు. ఈనెల 15, 16న పరీక్షలు జరగనున్నందున ఎలాంటి ఇబ్బందులు రాకూడదని, కరెంటు కోతలు ఉండకూడదని చెప్పారు.



తిరుపతిలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడును మర్యాదపూర్వకంగా కలిసిన హరీశ్‌రావు

సిద్దిపేటలో కొలువుదీరనున్న

తిరుపతి వేంకటేశుడు

- ఆలయ నిర్మాణం చేపట్టాలని టీటీడీ బోర్డు చైర్మన్ బీఆర్ నాయుడును కోరిన హరీశ్‌రావు

సిద్దిపేటటౌన్, డిసెంబరు10(ఆంధ్రజ్యోతి):తిరుమల తిరుపతి వేంకటేశ్వర స్వామి ఆలయం సిద్దిపేటలో కొలువుదీరనుందని మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు తెలిపారు. మంగళవారం తిరుపతి వెళ్లిన హరీశ్‌రావు టీటీడీ బోర్డు చైర్మన్ బీఆర్ నాయుడును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు సిద్దిపేట కోమటిచెరువు ప్రాంతంలో తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో తలపెట్టిన వేంకటేశ్వర ఆలయ నిర్మాణం చేపట్టాలని కోరారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి సిద్దిపేట కోమటిచెరువు ప్రాంతంలో 5ఎకరాల 10 గుంటల స్థలాన్ని మంజూరు చేశామని చెప్పారు. గతంలోనే టీటీడీ ఇంజనీరింగ్ అధికారులు పర్యటించి ఆలయ నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని పరిశీలించారని చెప్పారు. అందుకు అనుగుణంగా ఆలయ నిర్మాణ నమూనా, డిజైన్‌ను రూపొందించారని చైర్మన్‌కు వివరించినట్లు తెలిపారు. తిరుపతి వేంకటేశ్వర స్వామి అంటే ప్రజలు ఇష్టదైవంగా, ఇలవేల్పుగా కొలుస్తారని, అలాంటి ఆలయం సిద్దిపేటలో నిర్మించడం గొప్ప అదృష్టమన్నారు. వచ్చే బోర్డు మీటింగ్‌లో సిద్దిపేటలో వేంకటేశ్వర ఆలయ నిర్మాణానికి ఆమోదం తెలిపి, మీరే ఆలయ నిర్మాణ పనుల శంకుస్థాపనకు ముఖ్యఅతిథిగా రావాల్సిందిగా కోరినట్లు చెప్పారు. అందుకు చైర్మన్ బీఆర్ నాయుడు సానుకూలంగా స్పందించి చీఫ్ ఇంజనీర్ అధికారి, సంబంధిత అధికారులను పిలిచి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు.

తప్పిపోయిన బాలుడి అప్పగింత



బాలుడిని కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న పోలీసులు

రాయపోల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాయపోల్ మండలం రాంసాగర్ గ్రామానికి సోమవారం రాత్రి తప్పిపోయి వచ్చిన మూగ బాలుడిని కుటుంబ సభ్యుల చెంతకు చేర్చారు. గ్రామానికి బాలుడు తప్పిపోయి వచ్చిన విషయాన్ని స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా, వారు వచ్చి విచారించారు. బాలుడు చేగుంట మండలం అనంతసాగర్ గ్రామానికి చెందిన నాగభూషణం కుమారుడు శివలింగం అక్షయ్ కుమార్(13)గా గుర్తించారు. మంగళవారం బాలుడిని పెదనాన్న బూదయ్య, అక్క రేణుకకు అప్పగించినట్లు హెడ్ కానిస్టేబుల్ భాస్కర్‌రెడ్డి తెలిపారు.

మొక్కుబడిగా సీఎం కప్



సీఎం కప్ క్రీడలను ప్రారంభిస్తున్న ఎంపీడీవో

మనోహరాబాద్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మనోహరాబాద్ మండల కేంద్రంలో సీఎం కప్ క్రీడలు మొక్కుబడిగా సాగాయి. మండల స్థాయి క్రీడలకు ఎంపీడీవో వెంకటేశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డిలు హాజరై క్రీడలను ప్రారంభించారు. అయితే, మండలంలో 17 గ్రామ పంచాయతీలు ఉండగా, కొన్ని గ్రామాలకు చెందిన క్రీడాకారులు మాత్రమే హాజరయ్యారు. వాస్తవానికి గ్రామాల్లో క్రీడలు నిర్వహించి మండల స్థాయికి ఎంపిక చేయాల్సి ఉండగా, అసలు కొన్ని గ్రామాలకు సమాచారం ఇవ్వకుండానే క్రీడలు నిర్వహించారు. కబడ్డీ నాలుగు టీంలు, వాలీబాల్ ఆరు టీంలతో పాటు మరికొన్ని క్రీడలు నిర్వహించి చేతులు దులుపుకున్నారు. చాలా గ్రామాల్లో తమకు అసలు సమాచారమే లేదని క్రీడాకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
















సదాశివపేట మండలంలో ఓ జిన్నింగ్ మిల్లులో పత్తి

రైతులకు నో ఎంట్రీ.. దళారులకు వెల్‌కమ్..

పత్తి కొనుగోళ్లలో వివక్ష ● అధికారుల తీరుతో రైతుల పరేషాన్

సదాశివపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రైతులకు నో ఎంట్రీ.. దళారులకు వెల్‌కమ్ అన్నట్లు వ్యవహరిస్తున్నారు ఇక్కడి సీసీఐ అధికారులు. జిన్నింగ్ మిల్లుల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల గేట్లకు లారీల్లో, డీసీఎం, భారీ వాహనాల్లో తెచ్చిన పత్తి తీసుకోమని బోర్డులు పెట్టిన అధికారులు.. రైతులు తెచ్చిన సరుకును తిప్పి పంపుతూ.. వ్యాపారులు తీసుకొచ్చిన పత్తిని కొనుగోలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.



నిబంధనలకు విరుద్ధంగా లారీలు, డీసీఎం వాహనాల్లో పత్తిని తీసుకొచ్చి తూకంకు సిద్ధంగా ఉంచిన దృశ్యం

బయటే కొనుగోళ్లు..

సీసీఐ కేంద్రాల నుంచి అధికారులు రైతుల పత్తి కొనుగోలు చేయకుండా వెనక్కి పంపిస్తుండటంతో కేంద్రాల బయటే టెంట్లు వేసుకున్న వ్యాపారులు కొనుగోళ్లు చేపడుతున్నారు. పత్తి క్వింటాల్‌కు సీసీఐ మద్దతు ధర రూ. 7521 ఉండగా, దళారులు.. వ్యాపారుల క్వింటా రూ. 6 వేల నుంచి రూ. 6,400 వరకు కొనుగోలు చేస్తున్నారు. అలా కొనుగోలు చేసిన పత్తిని మళ్లీ సీసీఐ కేంద్రంలోనే విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. ఇలా వ్యాపారులు క్వింటా పత్తిపైనే రూ. 2 వేల వరకు లాభం పొందుతున్నారు. వ్యాపారులతో కుమ్మక్కైన అధికారులు రైతుల వద్ద పత్తి కొనుగోలు చేయకుండా, వెనక్కి పంపిస్తూ దళారుల దందాకు అండగా నిలుస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

స్పాట్ పేమెంట్

సీసీఐ కొనుగోలు చేసిన పత్తికి దాదాపు పది నుంచి పదిహేను రోజుల తర్వాత రైతు ఖాతాలో డబ్బులు వేస్తోంది. అయితే, బయటి వ్యాపారులు తేమ, రంగు, క్వాలిటీ అని సాకులు చెప్పకుండా సుమారు రెండు వేలు తక్కువకు కొనుగోలు చేస్తూ, వెంటనే డబ్బులు చెల్లిస్తున్నారు. వెంటనే నగదు చేతికి వస్తుండటంతో రైతులూ బయటి వ్యాపారులకే పత్తి విక్రయిస్తున్నారు.

రైతులకు కొర్రీలు..

సదాశివపేట వ్యవసాయ మార్కెట్‌శాఖ పరిధిలో మూడు జిన్నింగ్ మిల్లులు ఉన్నాయి. ఈ మూడు మిల్లుల్లో ప్రభుత్వం గత నవంబరు 4న సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఇప్పటి వరకు 2,826 మంది రైతుల వద్ద 91,199.85 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేసి, దాదాపు రూ.68కోట్లు చెల్లించినట్లు అధికారులు చెబుతున్నారు. అయితే, రైతులు ఆయా కేంద్రాలకు పత్తి తీసుకువస్తే తేమ శాతం, రంగు, క్వాలిటీ అంటూ కొర్రీలు పెడుతున్నారు.

తగ్గిన దిగుబడి..

సదాశివపేట మండలంలో ఈ ఏడాది 33,500 ఎకరాల్లో పత్తి సాగు జరిగింది. ఎకరాకు సుమారు 12 క్వింటాళ్ల మేర దిగుబడి రావాల్సి ఉండగా, ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో దిగుబడి ఎకరానికి 6 క్వింటాళ్లు మించి రాలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

లెక్క తేలిస్తే..

రైతుల లెక్క ప్రకారం ఒక ఎకరానికి ఈ ఏడాది కనీసం 7 క్వింటాళ్ల దిగుబడి సైతం రాలేదు. ఈ నేపథ్యంలో సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో ఏ ప్రాంతానికి చెందిన రైతు ఎకరానికి ఎన్ని క్వింటాళ్ల పత్తి విక్రయించాడు. ఆయా ప్రాంతాల్లో వ్యవసాయ శాఖ అధికారుల వద్ద ఉన్న పత్తిసాగు వివరాలు, రైతుల పేరిట పత్తి అమ్మకాలు జరిపిందెవరు? వంటి వివరాలపై అధికారులు దృష్టి సారిస్తే సీసీఐ కేంద్రాల్లో అధికారులు చేసిన అక్రమాలు వెలుగులోకి వస్తాయని రైతులు అంటున్నారు.



సైంటిస్ట్- ఐఐటీ-హెచ్‌లో నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో శాస్త్రవేత్తలు

ఐఐటీ-హెచ్‌లో అంతర్జాతీయ సదస్సు

ఆరోగ్యంపై జీవనప్రక్రియల ప్రభావం మీద చర్చలు

కంది, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యంపై జీవన ప్రక్రియల ప్రభావం ఎలా ఉంటుందనే అంశంపై సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ-హెచ్)లో అంతర్జాతీయ సదస్సు జరిగింది. ఇండియన్ సొసైటీ ఫర్ క్రోనో బయాలజీ, కేంద్ర ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక శాఖ సంయుక్తంగా దీనిని నిర్వహించాయి. 'కార్డియన్ రిథమ్స్ ఇన్ హెల్త్ అండ్ డిసీజెస్: ఫ్రమ్ డిస్కవరీ టు పంక్షన్' (సీఆర్‌హెచ్‌డీ 2024) పేరిట ఈ నెల 5-7 తేదీల్లో మూడు రోజులపాటు జరిగింది. దీనికి సంబంధించిన వివరాలతో ఐఐటీహెచ్ మంగళవారం పత్రికా ప్రకటన విడుదల చేసింది. ఆస్ట్రేలియా, డెన్మార్క్, ఐర్లాండ్, అమెరికా, బ్రిటన్, జపాన్, సింగపూర్, జర్మనీ, యూఏఈ, ఇజ్రాయెల్‌తో మన దేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన శాస్త్రవేత్తలు ఈ సదస్సులో పాల్గొన్నారు. సీసీఎంబీ మాజీ డైరెక్టర్, తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్సెస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ సీహెచ్ మోహన్‌రావు సదస్సును ప్రారంభించి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కాగా, సదస్సులో భాగంగా ఇండియన్ సొసైటీ ఫర్ క్రోనో బయాలజీ అధ్యక్షుడు ప్రొఫెసర్ వినోద్ కుమార్‌కు జీవితకాల సాఫల్య పురస్కారాన్ని అందించారు. ఈ సదస్సు భారతీయ క్రోనోబయాలజీ రంగం ప్రస్థానంలో ఒక మైలురాయి వంటిదని సదస్సు కన్వీనర్ సాందీపని రాయ్ పేర్కొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

సిద్దిపేట క్రైం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తాళం వేసి ఉన్న ఇంటిని టార్గెట్ చేసిన దొంగలు ఉన్నదంతా ఊడ్చుకెళ్లారు. సిద్దిపేట బృందావన కాలనీ వీధి నంబర్-3కు చెందిన కోదూరు అభినవ్ ఈ నెల 3న ఇంటికి తాళం వేసి, తన తల్లిని హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తీసుకెళ్లాడు. మంగళవారం వచ్చి చూడగా, తాళ పగిలి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా, బీరువాలోని ఎనిమిది తులాల బంగారు ఆభరణాలు, 500 గ్రాముల వెండి వస్తువులు, రూ. లక్ష వేల నగదు ఎత్తుకెళ్లారు. అభినవ్ ఫిర్యాదు మేరకు పోలీసులు వచ్చి, క్లూస్ టీం సహాయంతో ఆధారాలు సేకరించారు. బాధితుని ఫిర్యాదు మేరకు సీఐ ఉపేందర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట స్థావరంపై దాడి

జహీరాబాద్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జహీరాబాద్ మండలంలోని గోవిందాపూర్ గ్రామశివారు అటవీ ప్రాంతంలో గుట్టుగా నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై పోలీసులు మంగళవారం దాడి చేశారు. ఈ దాడిలో రూ.1.42 లక్షల నగదు, పది సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని పది మందిని అరెస్ట్ చేసినట్లు జహీరాబాద్ పట్టణ ఎస్ఐ కాశీనాథ్, చిరాగ్‌పల్లి ఎస్ఐ రాజిరెడ్డి తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో జరిమానాలు

సిద్దిపేట క్రైం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ టెస్ట్‌లో పట్టుబడిన వారికి ఆయా మెజిస్ట్రేట్లు జరిమానాలు విధించారు. సిద్దిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ కుమార్ తన సిబ్బందితో కలిసి కొన్ని రోజుల క్రితం సిద్దిపేటలోని నర్సాపూర్ చౌరస్తా, ఎంపీడీవో ఆఫీస్ చౌరస్తాలలో నిర్వహించిన తనిఖీల్లో 23 మంది పట్టుపడ్డారు. వారిని మంగళవారం సిద్దిపేట స్పెషల్ సెకండ్ క్లాస్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ కాంతారావు ఎదుట హాజరు పరచగా, 23 మందికి రూ.31,000 జరిమానా విధించారు.

గజ్వేల్‌లో 18 మందికి..

గజ్వేల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఇటీవల గజ్వేల్ పట్టణంలో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 18 మంది పట్టుపడ్డారు. వారిని మంగళవారం అదనపు ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ప్రియాంక ఎదుట హాజరుపరగా, వారికి రూ.11,500 జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ మురళీ తెలిపారు.

ఇద్దరికి జైలు

కోహెడ/మద్దూరు, డిసెంబరు10 (ఆంధ్రజ్యోతి): కోహెడ మండలంలో డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుపడిన ఇద్దరికి హుస్నాబాద్ న్యాయాధికారి ఏ. కృష్ణతేజ్ ఏడు రోజుల జైలుశిక్ష విధించారు. డ్రంకెన్ డ్రైవ్ టెస్ట్‌ల్లో మొత్తం పది మంది పట్టుపడగా, అందులో ఇద్దరికి జైలు, మిగిలిన వారికి రూ. 12 వేల జరిమానా విధించినట్లు హుస్నాబాద్ ఎస్ఐ పి. అభిలాష్ తెలిపారు. అలాగే, జనగామ జిల్లా రఘునాథ్‌పల్లి మండలం మేకలగట్టు గ్రామానికి చెందిన ఇస్లావత్ మధుకు ఏడు రోజుల జైలు శిక్ష విధిస్తూ న్యాయాధికారి తీర్పు చెప్పారని మద్దూరు ఎస్ఐ షేక్ మహబూబ్ తెలిపారు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరిస్తాం

మెదక్ అర్బన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగు సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు చేపడతామని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన దివ్యాంగుల నుంచి కలెక్టర్ వినతులు స్వీకరిస్తూ.. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దివ్యాంగుల అధైర్యపడొద్దని పాలన యంత్రాంగం అండగా ఉంటుందన్నారు. దివ్యాంగులు కార్యాలయాల చుట్టూ తిరగొద్దని, సమస్యలు పరిష్కరించి మీ ఫోన్‌కు సమాచారం ఇస్తామన్నారు. దివ్యాంగుల వైకల్యాలను పరిగణలోకి తీసుకొని ప్రత్యేక వైద్య నిపుణులతో హెల్త్ క్యాంపు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ ప్రత్యేక ప్రజావాణికి మొత్తం 65 దరఖాస్తులు వచ్చాయి. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ నగేష్, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



దివ్యాంగుల వినతులను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్

17న పోలింగ్ స్టేషన్ల జాబితా

గ్రామ పంచాయతీ ఎన్నికల కోసం ఏర్పాటు చేసిన ముసాయిదా పోలింగ్ స్టేషన్ల జాబితాపై అభ్యంతరాలు ఉంటే ఈనెల 12లోపు సంబంధిత ఎంపీడీవో కార్యాలయంలో తెలపాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ సూచించారు. కలెక్టరేట్‌లో మంగళవారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే ఈ నెల 7న జిల్లాలోని అన్ని మండలాలు, గ్రామ పంచాయతీల్లో జాబితాను ప్రదర్శించామని, జిల్లాలో మొత్తం 491 గ్రామ పంచాయతీలు, 4210 వార్డులు ఉన్నాయన్నారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం 4210 కేంద్రాలను గుర్తిస్తూ.. ముసాయిదాను రూపొందించామన్నారు. ఈ నెల 12 అభ్యంతరాలు స్వీకరణ, 13న పరిష్కారం, 17న తుది పోలింగ్ కేంద్రాల జాబితా ప్రకటన ఉంటుందన్నారు. అలాగే, కలెక్టరేట్‌లో సాయంత్రం వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.


జహీరాబాద్ పట్టణ సమీపంలోని హోతి(కే)లో నిర్మించిన డబుల్‌బెడ్‌రూం ఇళ్లు

డబుల్.. గుబుల్

వైఎస్సార్‌కాలనీ ఇళ్లకు పట్టిన గతే పడుతుందని భయం

- నిర్మాణం పూర్తయినా అప్పగింతలో జాప్యం
- పదేళ్లుగా అలంకార ప్రాయంగానే..
- కలగానే నిరుపేదలకు సొంతింటి కల

జహీరాబాద్, డిసెంబరు10(ఆంధ్రజ్యోతి) : జహీరాబాద్ పట్టణ ప్రాంత నిరుపేద ప్రజలకు సొంతింటికల కలగానే మిగిలిపోతుంది. ప్రభుత్వాలు మారినా ఫలితం దక్కడంలేదు. కోట్ల రూపాయలు వెచ్చించి నిర్మించిన ఇళ్లు నిరుపయోగంగా మారుతున్నాయి. ఫలితంగా అవి శిథిలమై ఎందుకూ పనికి రాకుండా పోతున్నాయి. రెండు దశాబ్దాల క్రితం పట్టణ సమీపంలోని అల్గోల్- బీదర్‌కు వెళ్లే రోడ్డు పక్కన అల్లానాసమీపంలో వైఎస్సార్‌కాలనీ పేరిట సుమారు 800 పైచిలుకు ఇళ్లను నిర్మించేందుకు అప్పట్లో పాలకులు నిర్ణయించారు. అందులో సుమారు 150 ఇళ్లను పూర్తిస్థాయిలో నిర్మాణం పూర్తికాగా, మరికొన్ని పునాది స్థాయి దశలో ఉన్నాయి. అప్పట్లో వీటిని లబ్ధిదారులకు ఇచ్చేందుకు వీలుగా జాబితాను సిద్ధం చేశారు. అందులో అనర్హులకు తోడు, నిర్మాణం కోసం ఎంపిక చేసిన స్థలం విషయంలో వివాదాల చోటుచేసుకోవడంతో ఆ పనులను అర్ధాంతరంగా నిలిపివేశారు. అప్పటి నుంచి వాటిని పట్టించుకోవడంతో ప్రస్తుతం శిథిలావస్థకు చేరాయి. ఇదిలా ఉండగా పదేళ్ల క్రితం బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టణంలోని రహ్మత్‌నగర్‌లో 320, కోహీర్ మండలంలోని దిగ్వాల్ గ్రామంలో 20 ఇళ్లను నిర్మించి లబ్ధిదారులకు అందజేశారు. అలాగే హోతి(కే) గ్రామ సమీపంలో 10ఎకరాల స్థలంలో రూ.34.98 కోట్ల వ్యయంతో ఒక్కోబ్లాక్‌లో 24 ఇళ్లచొప్పున 27 బ్లాకుల్లో కలిపి 700 ఇళ్లను నిర్మించారు. ఇందులో 40 ఇళ్లు పస్తాపూర్‌లో లబ్ధిదారులకు కేటాయించారు. మరో 660 మాత్రం ఇప్పటికీ కేటాయించలేదు. దీంతో వీటికి కూడా వైఎస్సార్‌కాలనీ ఇళ్లకు పట్టిన గతే పడుతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్ద భద్రత కొరవడిన నేపథ్యంలో గుర్తుతెలియని ఆకతాయిలు కిటికీలకు సంబంధించిన అద్దాలు ధ్వంసం చేశారు.

ఎన్నికల సమయంలో హడావుడిగా..

హోతి(కే) గ్రామశివారులో నిర్మితమైన డబుల్‌బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక గతేడాది శాసనసభ ఎన్నికల ముందు హడావుడిగా జరిగింది. మాజీమంత్రి హరీ‌ష్‌రావు చేతుల మీదుగా పలువురికి గృహప్రవేశాలు కూడా చేయించారు. ఇంతలోనే ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడంతో పంపిణీ అటకెక్కి అలంకార ప్రాయంగా మారాయి. అయితే ఎంపికైన కొందరు లబ్ధిదారులకు ధ్రువపత్రాలు ఇచ్చి ఇంటి తాళాలు ఇవ్వలేదు. మరికొందరు అర్హులు జాబితాకే పరిమితమయ్యారు. ప్రస్తుత ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలపై దృష్టి పెడుతుండడంతో ఈ డబుల్ బెడ్‌రూంల పరిస్థితి కొలిక్కి వస్తుందా, మళ్లీ లాటరీలు నిర్వహిస్తారా, కొత్తగ దరఖాస్తులు తీసుకుంటారా అనే విషయం ప్రశ్నార్థకంగా మారింది. ఈ విషయమై సంబంధిత రెవెన్యూ అధికారులను డబుల్‌బెడ్ రూంల పరిసర ప్రాంతాల్లో, పలు పనులు పెండింగ్‌లో ఉన్నాయని, త్వరలో పంపిణీకి చర్యలు తీసుకుంటామన్నారు.


రెండుదశాబ్దాల క్రితం వైఎస్సార్ కాలనీలో నిర్మించిన ఇళ్ల దుస్థితి

ఆశల అరెస్టు

- చలో హైదరాబాద్‌కు వెళ్తుండగా..
- హైవే టోల్‌ప్లాజా వద్ద చెక్‌పోస్టు



తూప్రాన్ టోల్‌ప్లాజా వద్ద పోలీసుల తనిఖీలు

తూప్రాన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తమ డిమాండ్ల సాధన కోసం చలో హైదరాబాద్ కార్యక్రమానికి తరలుతున్న ఆశ వర్కర్లను పోలీసులు సోమవారం రాత్రి నుంచి అడ్డుకున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లా సహా.. వివిధ జిల్లాల నుంచి వాహనాల్లో తరలుతున్న ఆశ వర్కర్లను అడ్డుకుని అరెస్ట్ చేశారు. వారిని తిరిగి స్వగ్రామాలకు పంపించారు. ఇందుకోసం 44వ జాతీయ రహదారిపై మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణ పరిధి టోల్‌ప్లాజా వద్ద చెక్‌పోస్టు ఏర్పాటు చేసి వాహన తనిఖీలు నిర్వహించారు. తూప్రాన్ ఎస్‌ఐ శివానందం ఆధ్వర్యంలో రాత్రి నుంచి వాహనాల తనిఖీ చేపట్టారు. ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి, మెదక్, రాజన్న సిరిసిల్ల జిల్లాల నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న పలువురు ఆశ వర్కర్లను అడ్డుకుని పోలీ‌స్‌స్టేషన్‌కు తరలించారు. తూప్రాన్ వద్ద పట్టుకున్న సుమారు 200 మందికిపైగా ఆశ వర్కర్లను తూప్రాన్, వెల్దుర్తి, శివ్వంపేట, చేగుంట, రామాయంపేట తదితర పోలీసుస్టేషన్లకు తరలించారు. తూప్రాన్ పోలీసుస్టేషన్‌లో వివిధ జిల్లాలకు చెందిన 51 మందిని అరెస్టు చేసి, సొంత పూచీకత్తుపై వదిలేశారు. మంగళవారం ఉదయం సైతం ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాలు తనిఖీ చేసి ఆశలను తిప్పి స్వగ్రామాలకు పంపించారు.



ఆవాలతో చిత్రం

గజ్వేల్ రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గీతా జయంతిని పురస్కరించుకుని గజ్వేల్‌కు చెందిన రామకోటి రామరాజు ఆవాలతో కృష్ణ, అర్జునుడు, భగవద్గీత పుస్తక చిత్రాలను రూపొందించారు. ఆ చిత్రాన్ని మంగళవారం గజ్వేల్‌లోని ఆయన కార్యాలయంలో ఆవిష్కరించారు.

క్రైం కార్నర్

నీటి సంపులో పడి వ్యక్తి మృతి


కొండల్ రెడ్డి (ఫైల్)

సిద్దిపేట రూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి) : నీటి సంపులో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం రాత్రి సిద్దిపేట రూరల్ మండలం ఇర్కోడు గ్రామంలో చోటుచేసుకుంది. సిద్దిపేట రూరల్ ఎస్సై అపూర్వరెడ్డి, గ్రామస్థులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆ గ్రామానికి చెందిన మారెడ్డి కొండల్‌రెడ్డి(52) వ్యాపారం చేసుకుంటూ హైదరాబాదులో నివాసముంటున్నారు. ఈ నెల 9న సిద్దిపేటకు వెళ్తున్నానని కుటుంబ సభ్యులకు చెప్పి హైదరాబాద్ నుంచి వచ్చాడు. 9న సాయంత్రం భార్య సుజాత కొండల్‌రెడ్డికి ఫోన్ చేయగా ఇర్కోడు గ్రామంలోని తన అమ్మ ఇంటికి వెళ్తున్నానని చెప్పాడు. అదేరోజు రాత్రి 9.30 గంటలకు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. అర్ధరాత్రి సుజాతకు సోదరుడు నరసింహారెడ్డి ఆమె ఫోన్ చేసి కొండల్‌రెడ్డి వ్యవసాయ పొలం వద్ద నీటి సంపులో పడి చనిపోయాడని తెలిపాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఫిట్స్ వచ్చి కిందపడి..

చేగుంట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఫిట్స్ వచ్చి కిందపడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని వడియారం గ్రామ శివారులో మంగళవారం చోటుచేసుకుంది. చేగుంట ఎస్సై చైతన్యకుమార్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం కర్ణాటక రాష్ట్రం బీదర్ జిల్లా రేకులగి గ్రామానికి చెందిన గణపతి నానాపూర్ (40) లారీ క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. చేగుంట మండల పరిధిలో ఓ రైస్‌మిల్‌లో వరిపొట్టు లోడు చేసుకుని వడియారం శివారులో కాంట వద్ద తూకం గురించి లారీ దిగుతుండగా అకస్మాత్తుగా ఫిట్స్ రావడంతో కిందపడ్డాడు. వెంటనే 108 అంబులెన్స్‌లో రామాయంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. మృతుడి భార్య అరుణ ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

దుబ్బాక, డిసెంబరు10 (ఆంధ్రజ్యోతి) : అప్పులబాధతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన దుబ్బాక మున్సిపాలిటీలోని దర్మాజీపేట వార్డులో చోటుచేసుకుంది. దుబ్బాక ఎస్ఐ గంగరాజు తెలిపిన వివరాల ప్రకారం ధర్మాజీపేట వార్డుకు చెందిన నర్సింహులు(42) తన కుమార్తె వివాహం కోసం చేసిన అప్పులను తీర్చలేక ఇబ్బందులు పడుతున్నాడు. దీంతో మనస్తాపానికి గురైన ఆయన మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో దూలానికి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య ఇంటికి వచ్చే చూసేసరికి తలుపులకు లోపల నుంచి గడియ వేసి ఉండడం, ఎంతసేపటికీ తీయకపోవడంతో చుట్టుపక్కలవారి సహాయంతో తలుపులను తీయగా నర్సింహులు మృతదేహం దూలానికి వేలడుతూ కనిపించింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం దుబ్బాక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఆర్థిక ఇబ్బందులతో..


పోచయ్య(ఫైల్)

చిలిప్‌చెడ్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం మండలం పరిధిలోని జగ్గంపేట గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన నాగన్నొల్ల పోచయ్య (50) ఇంటి నిర్మాణం కోసం అప్పులు చేశాడు. ఆర్థిక ఇబ్బందులు, అప్పుల విషయమై తన భార్య శేఖమ్మతో తరచూ చెబుతూ మదనపడుతుండేవాడు. ఈ నేపథ్యంలో సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు బయటికి వెళ్లిన అతను రాత్రి అయినా తిరిగి రాలేదు. మంగళవారం వెతకగా తన తమ్ముడు శ్రీనివాస్ పొలంలో వేప చెట్టు కింద పోచయ్య మృతదేహం కనిపించింది. పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై మిస్బావుద్దీన్ తెలిపారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అగ్ని ప్రమాదం.. లక్షన్నర దగ్ధం

అల్లాదుర్గం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : అల్లాదుర్గం మండలంలోని ఐబీ గిరిజనతండాలోని ఓ ఇంట్లో అగ్ని ప్రమాదం జరగగా నగదు దగ్ధమైంది. వివరాలు ఇలా ఉన్నాయి. తండాకు చెందిన దేవసోత్ విఠిబాయి, కవిత మంగళవారం వ్యవసాయ పనులకు వెళ్లారు. మధ్యాహ్నం ఇంటి నుంచి పొగలు రావాడంతో కాలనీవాసులు గమనించి వారికి సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న వారు మంటలను ఆర్పారు. ఈ ఘటనలో బీరువాలో దాచి ఉంచిన రూ.1.50 లక్షల నగదు, విలువైన ఇతర ధ్రువపత్రాలు, సామాగ్రి దగ్ధమైంది. వరిధాన్యం విక్రయించగా వచ్చిన నగదు కాలిపోవడంతో బాధితులు కన్నీరుమున్నీరయ్యారు. రూ.2లక్షల ఆస్తి నష్టం వాటిల్లనట్లు తెలిపారు. అగ్ని ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు.


ధర్నాలో మాట్లాడుతున్న సాయిబాష

విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్న సర్కార్

- బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాయిబాష
- ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా

సంగారెడ్డి రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్నదని, అధికారంలోకి వచ్చి సంవత్సరం గడిచినా విద్యాశాఖ మంత్రిని నియమించకుండా కాలయాపన చేస్తున్నదని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాయిబాష విమర్శించారు. సంగారెడ్డి ఆర్డీవో కార్యాలయం ఎదుట విద్యార్థులతో కలిసి సంఘం నాయకులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్పులు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకుండా వారి జీవితాలతో చెలగాటమాడుతోందని అన్నారు. పక్క రాష్ట్రమైన ఏపీలో రూ.20వేల చొప్పున స్కాలర్‌షిప్పులు ఇస్తున్నారని, ధనిక రాష్ట్రమైన తెలంగాణలో రూ.5,500 ఇవ్వడం సిగ్గుచేటన్నారు. గురుకులాల్లో 48 మంది విద్యార్థులు చనిపోయినా ప్రభుత్వానికి చీమ కుట్టినట్టు కూడా లేదని ధ్వజమెత్తారు. హైదరాబాద్‌లో మూసీ సుందరీకరణకు రూ.1.50 లక్షల కోట్లు ఖర్చు పెట్టేందుకు బడ్జెట్ ఉంటుంది కానీ, విద్యార్థులకు చెల్లించేందుకు బడ్జెట్ ఉండదా అని ప్రశ్నించారు. వెంటనే పెండింగ్ స్కాలర్‌షిప్పులు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సాయిబాషాను పోలీసులు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

దీంతో ఉద్రిక్తత వాతావరణం నెలకొన్నది. అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని, విద్యార్థులకు న్యాయం జరిగే వరకు పోరాడుతూనే ఉంటామని సాయిబాష స్పష్టం చేశారు. నాయకులు ప్రదీప్‌గౌడ్, వర్ధన్‌గౌడ్, మణి, ప్రవీణ్, చింటూ, హరిప్రసాద్, రోహిత్‌గౌడ్, నాని, శివ, శ్యామ్, పవన్, విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి మల్లన్న ఉత్సవాలు

టేక్మాల్, డిసెంబర్ 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కాద్లూర్ గ్రామంలోని మల్లికార్జునస్వామి ఉత్సవాలు నేటి నుంచి ఐదురోజులపాటు జరగనున్నాయి. కొండల నడుమ కొలువైన స్వామివారిని దర్శించుకునేందుకు రాష్ట్ర నలుమూలల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి కూడా భక్తులు తరలివస్తారు. ఉత్సవాల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

రోజువారీ కార్యక్రమాలు..

11న బోనాలు సమర్పణ, 12న బండ్ల శకటోత్సవం, 13న కుస్తీ పోటీలు, 14న రథోత్సవం, 15న బండ్ల ఊరేగింపు నిర్వహించనున్నారు. కుస్తీ పోటీలలో గెలుపొందిన వారికి నగదు బహుమతితోపాటు ఐదు తులాల వెండి కడియాన్ని బహూకరించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ ఉత్సవాలకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ హాజరవుతారని తెలిపారు.

పోలీస్‌స్టేషన్‌లో ప్రేమికుల వివాహం

అల్లాదుర్గం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : అల్లాదుర్గం పట్టణానికి చెందిన ఎనుగండ్ల నరేష్, అదే గ్రామానికి చెందిన లావణ్య మూడేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. వీరి పెళ్లికి అమ్మాయి కుటుంబీకులు అంగీకరించలేదు. దీంతో ఆ జంట మంగళవారం అల్లాదుర్గం పోలీసులను ఆశ్రయించి ఎస్‌ఐ ప్రవీణ్‌రెడ్డి సమక్షంలో పోలీస్‌స్టేషన్‌లోనే వివాహం చేసుకున్నారు. అబ్బాయి తల్లిదండ్రులతో కలసి పోలీసులను ఆశ్రయించిన జంటకు ముందుగా ఎస్ఐ కౌన్సెలింగ్ ఇచ్చారు. అయినా పెళ్లి చేసుకుంటామని చెప్పడంతో వివాహం జరిపించారు.



కుష్ఠుపై భయాందోళన వద్దు

రాష్ట్ర మానిటరింగ్ అధికారి సరస్వతి


సర్వేను పరిశీలిస్తున్న రాష్ట్ర మానిటరింగ్ అధికారి సరస్వతి

నారాయణఖేడ్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): కుష్ఠు వ్యాధిపై ఎవరూ భయాందోళన చెందాల్సిన అవసరం లేదని రాష్ట్ర మానిటరింగ్ అధికారి సరస్వతి అన్నారు. మంగళవారం ఖేడ్ పరిధిలోని నిజాంపేటలో నిర్వహిస్తున్న కుష్ఠు వ్యాధి గ్రస్తుల సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ వ్యాధి మైక్రో బ్యాక్టీరియం లెప్రే బ్యాక్టీరియాతో వ్యాపిస్తుందన్నారు. ప్రధానంగా చర్మానికి, నరాలకు సోకుతుందని, నెమ్మదిగా పెరిగి వ్యాధి లక్షణాలు బహిర్గతం కావడానికి మూడు నుంచి ఐదు సంవత్సరాలు పడుతుందన్నారు. వ్యాధి సోకిన వారు ఎలాంటి భయానికి గురి కావాల్సిన అవసరం లేదని, బహుళ ఔషధ చికిత్స విధానంతో ఆరు నెలల నుంచి 12 నెలల్లో నయం చేయవచ్చన్నారు. ఈ వ్యాధిపై ఎలాంటి అనుమానాలున్నా సమీపంలోని ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలన్నారు. ఆమె వెంట డిప్యూటీడీఎంఅండ్‌హెచ్‌వో సంధ్యారాణి, మెడికల్‌ఆఫీసర్‌రాజేశ్వర్, శేఖర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

శివ్వంపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా తరలిస్తున్న 11 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం ఆటోను పోలీసులు అదుపులోకి తీసుకున్న ఘటన మంగళవారం ఉసిరికపల్లి చౌరస్తాలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మండల పరిధిలోని ఉసిరికపల్లి చౌరస్తాలో రాత్రి పోలీసులు వాహనాల తనిఖీలు చేస్తున్నారు. గ్రామాల్లో తక్కువ ధరకు కొనుగోలు చేసిన రేషన్ బియ్యాన్ని విక్రయించేందుకు ఆటోలో తరలిస్తున్నారని సమాచారంతో తనిఖీ చేయగా 11 క్వింటాళ్ల బియ్యం పట్టుబడ్డాయి. దీంతో ఆటోను అదుపులోకి తీసుకొని సివిల్ సప్లై అధికారులకు అప్పగించారు. ఆ అధికారుల ఫిర్యాదు మేరకు రేషన్ బియ్యం తరలిస్తున్న భువనగిరికి చెందిన ధనావత్ లింగంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మధుకర్‌రెడ్డి తెలిపారు.

కారు ఢీకొని విరిగిపడ్డ విద్యుత్ స్తంభం



నారాయణఖేడ్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): కారు అదుపు తప్పి పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టడంతో అది విరిగిపడింది. వివరాలు ఇలా ఉన్నాయి. మంగళవారం తెల్లవారుజామున ఖేడ్ నుంచి కరసగుత్తి వైపు వెళ్తున్న కారు ఒక్క సారిగా అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని బలంగా ఢీకొట్టింది. దీంతో స్తంభం విరిగిపడగా, కారు ముందటి భాగం ధ్వంసమైంది. ఆ సమయంలో వాహనాల రద్దీ ఎక్కువ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

న్యూస్ బాక్స్

రేబర్తి సెక్రటరీకి ఉత్తమ అవార్డు



కలెక్టర్ నుంచి అవార్డు అందుకుంటున్న సెక్రటరీ మాధవ్‌జాదవ్

మద్దూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మద్దూరు మండలం రేబర్తి గ్రామపంచాయతీ కార్యదర్శి మాధవ్‌జాదవ్ జిల్లా ఉత్తమ పంచాయతీ సెక్రటరీగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మనుచౌదరి, జిల్లా పంచాయతీ అధికారి దేవకీదేవి నుంచి మంగళవారం ప్రశంసా పత్రంతో పాటు షీల్డ్ అందుకున్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రతీ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంతో పాటు స్వచ్ఛభారత్‌లో తడి, పొడి చెత్తతో వర్మీ కంపోస్టు తయారుచేసి స్థానిక రైతులకు విక్రయించి గ్రామపంచాయతీకి ఆదాయాన్ని సమకూర్చినందుకు బెస్ట్ ఎంప్లాయ్ అవార్డును సొంతం చేసుకున్నారు. ఈ సందర్భంగా తనకు సహకరించిన గ్రామస్థులకు, పంచాయతీ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

'కార్మికుల వెల్ఫేర్ బోర్డు అమలు చేయాలి'

కొండపాక, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కార్మికులందరికీ కనీస వేతనాల జీవోను వెంటనే విడుదల చేసి అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు అమ్ముల బాల నర్సయ్య డిమాండ్ చేశారు. మంగళవారం కొండపాక మండలం వెలికట్ట క్రాస్ రోడ్ వద్ద జాలిగామ ప్రభాకర్ అధ్యక్షతన మండల కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బాలనర్సయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న అసెంబ్లీ శీతాకాల సమావేశాల్లో అసంఘటితరంగా కార్మికులకు, స్కీం వర్కర్లకు సమగ్ర చట్టం చేసి కనీస వేతనాలు రూ.26 వేలు అమలుచేయాలని కోరారు.

కాంగ్రెస్ కార్యాలయంలో అయ్యప్పపడిపూజ



అయ్యప్ప పడిపూజలో చెరుకు శ్రీనివాస్‌రెడ్డి దంపతులు

దుబ్బాక, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : దుబ్బాకలోని కాంగ్రెస్ క్యాంపు కార్యాలయంలో మంగళవారం అయ్యప్పపడి పూజను నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి దంపతులు నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కొంగరిరవి, ఏసురెడ్డి, అనంతుల శ్రీనివాస్, నరేందర్, వెంకటస్వామిగౌడ్, కిష్టయ్య, చంద్రసాగర్ పాల్గొన్నారు.

కల్యాణవేదిక ప్రాంగణ పనులు ప్రారంభం

చేర్యాల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి మల్లన్న బ్రహ్మోత్సవాలు ఈనెల 29న నిర్వహించనున్నారు. కల్యాణంతో ఉత్సవాలు ప్రారంభంకానున్న నేపథ్యంలో ఆలయాధికారులు తోటబావి వద్ద కల్యాణ వేదిక ప్రాంగణం చదును పనులు ప్రారంభించారు. చెత్తాచెదారాన్ని తొలగించారు.



ప్రజావాణిలో వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ మనుచౌదరి

'ప్రజావాణి'కి 36 వినతులు

- కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట కలెక్టరేట్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో అర్జీదారుల నుంచి వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించి అర్జీదారులకు న్యాయం చేయాలని కలెక్టర్ మనుచౌదరి జిల్లా అధికారులను ఆదేశించారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ అబ్దుల్‌హమీద్‌తో కలిసి అర్జీదారుల నుంచి కలెక్టర్ దరఖాస్తులు స్వీకరించి మాట్లాడారు. ప్రజావాణిలో ఫిర్యాదులు తీసుకోవడమే కాకుండా సత్వరమే పరిష్కరించి అర్జీదారుడికి న్యాయం చేయాలని, వారంలోపు పరిష్కరించిన అర్జీలకు అధికారులు నివేదిక అందించాలన్నారు. ప్రజావాణిలో భూ సంబంధిత, ఆసరా పింఛన్లు ఇతరత్రా కలిపి మొత్తం 36 ఫిర్యాదులు వచ్చాయని ఆయన పేర్కొన్నారు. అనంతరం ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ ఆదేశాలనుసారం, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ స్వచ్ఛభారత్ ద్వారా నవంబరు 19 నుంచి డిసెంబరు 10 వరకు జిల్లాలోని అన్ని గ్రామాల్లో ప్రజల సహకారంతో క్షేత్రస్థాయి, మండల అధికారుల ద్వారా పారిశుధ్యంపైన అవగాహన కల్పించారు. ముఖ్యంగా వ్యక్తిగత మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు ఈ క్యాంపెయిన్‌లో భాగంగా వ్యక్తిగత మరుగుదొడ్లను అలంకరించుకున్న వారిని గ్రామ, మండలస్థాయిలో గుర్తించి కలెక్టర్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో నాగరాజమ్మ, డీఆర్డీఏ జయదేవ్ ఆర్యా, డీపీవో దేవకీదేవి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నా కొడుకు ఇంటి నుంచి గెంటేశాడు సారూ..



నా కొడుకుకు ఏ కష్టం రాకుండా చూసుకుంటే. నన్నే ఇంటి నుంచి గెంటేశాడు సారూ. ఇప్పుడు నేను నడవలేని పరిస్థితి. నా ఆరోగ్యం పూర్తిగా క్షీణించింది. నన్ను మంచిగా చూసుకుంటారనుకొని కోడలు పేరుమీద సిద్దిపేటలో 120 గజాల ప్లాట్‌ను రిజిస్ట్రేషన్ చేయించాను. నన్ను చూసుకోని వారికి నా ప్లాట్ ఎందుకు.. ఆ రిజిస్ట్రేషన్ రద్దుచేసి మళ్లీ నా పేరుమీదికి వచ్చేలా న్యాయం చేయండి సారూ.

- మొరం శెట్టి సక్కుబాయి, సిద్దిపేట

చదువుతోపాటు క్రీడలకూ ప్రోత్సాహం

- గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి
- అట్టహాసంగా సీఎం కప్ పోటీలు ప్రారంభం



కొండపాకలో సీఎం కప్ క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న తూంకుంట నర్సారెడ్డి

కొండపాక, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులను చదువుతోపాటు క్రీడల్లోనూ ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నదని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి అన్నారు. మంగళవారం కొండపాక వేద ఇంటర్నేషనల్ స్కూల్ ఆవరణలో ఉమ్మడి కొండపాక మండల సీఎం కప్ క్రీడలను ప్రారంభించారు. ఉమ్మడి కొండపాక ఎంపీడీవో వెంకటేశ్వర్లు, తహసీల్దార్లు దిలీప్‌నాయక్, మల్లికార్జున్‌రెడ్డి, ఎంఈవోలు శ్రీనివాస్‌రెడ్డి, బచ్చలి సత్తయ్య ఆధ్వర్యంలో పోటీలు జరగ్గా.. కాంగ్రెస్ ఉమ్మడి కొండపాక మండలాధ్యక్షుడు విరుపాక శ్రీనివాస్‌రెడ్డి, వాసరి లింగారావు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

●తొగుట: తొగుట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సీఎం కప్ మండల స్థాయి క్రీడాపోటీలను ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి సీఐ లతీఫ్, ఎంఈవో నర్సయ్యతో కలిసి ప్రారంభించి మాట్లాడారు.

●మద్దూరు: మద్దూరు మండలంలోని మోడల్ స్కూల్‌లో సీఎం కప్ క్రీడలను కో ఆర్డినేటర్, ఎంపీడీవో ఎస్.రామ్మోహన్, ప్రిన్సిపాల్ గణేష్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మేక మల్లేశంతో కలిసి ప్రారంభించారు. ఎంపీడీవో కబడ్డీ ఆటతో క్రీడలు ప్రారంభించగా.. విద్యార్థులు పట్టుకోగా కిందపడ్డారు. తలకు దెబ్బ తగిలి స్పృహ తప్పి పడిపోయాడు. వెంటనే సిద్దిపేటలోని ఆస్పత్రికి తరలించారు.

●చేర్యాల: చేర్యాల పట్టణంలోని గురుకుల బాలుర పాఠశాలలో మునిసిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపారాణి, కొమురవెల్లి మండలం ఐనాపూర్ జడ్పీఎస్ఎస్ ఆవరణలో చేపట్టిన పోటీలను ఎంపీడీవో వర్మ, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, పీఏసీఎస్ చైర్మన్ మేరుగు కృష్ణ ప్రారంభించారు.

●గజ్వేల్: గజ్వేల్ పట్టణంలోని ఎడ్యుకేషన్‌హబ్‌లో నిర్వహించిన సీఎం కప్ క్రీడా పోటీలను ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ ఏఎంసీ వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్‌తో కలసి ప్రారంభించారు.

●సిద్దిపేట రూరల్: సిద్దిపేట రూరల్ మండలం రామవాపూర్ ఉన్నత పాఠశాలలో సీఎం కప్ మండలస్థాయి క్రీడా పోటీలను ఎంపీడీవో మురళీధర్‌శర్మ ప్రారంభించారు. ఎంఈవో కొత్త రాజిరెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు మంజుభార్గవి పాల్గొన్నారు.

●మిరుదొడ్డి: మిరుదొడ్డి మండల స్థాయి సీఎం కప్ టోర్నమెంట్‌ను ఎంపీడీవో గణేష్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో జహిరొద్దీన్, పంచాయతీ కార్యదర్శి వహీమ్ పాల్గొన్నారు.

మానవ హక్కులను ప్రతి ఒక్కరూ గౌరవించాలి



సిద్దిపేటలో నిర్వహించిన ర్యాలీలో న్యాయవాదులు

సిద్దిపేట క్రైం/గజ్వేల్ రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మానవ హక్కులను ప్రతి ఒక్కరూ గౌరవించాలని సిద్దిపేట జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయిరమాదేవి అన్నారు. మంగళవారం మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా న్యాయవాదుల ఆధ్వర్యంలో సిద్దిపేట జిల్లా కోర్టు నుంచి తీసిన లీగల్ అవేర్నెస్ ప్రోగ్రాం ర్యాలీలో ఆమె పాల్గొని మాట్లాడారు. మానవ హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉన్నదని తెలిపారు. జిల్లా కోర్టు నుంచి వెంకటేశ్వర ఆలయం మీదుగా విక్టరీ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో న్యాయవాదులతో పాటు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు. అలాగే గజ్వేల్ రూరల్ మండలం అనంతరావుపల్లి గ్రామంలో డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి ఆధ్వర్యంలో మానవ హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు.

14న జాతీయ మెగా లోక్ అదాలత్

- సీపీ డాక్టర్ బీ.అనురాధ

సిద్దిపేట క్రైం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 14న జాతీయ లోక్ అదాలత్ ఉంటుందని సిద్దిపేట సీపీ డాక్టర్ బీ.అనురాధ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో క్రిమినల్ కంపౌండబుల్, సివిల్ తగాదా, ఆస్తి విభజన, కుటుంబపరమైన నిర్వహణ, వైవాహిక జీవితానికి సంబంధించిన, బ్యాంకు రికవరీ, టెలిఫోన్ రికవరీ, విద్యుత్ చౌర్యం, చెక్ బౌన్స్ కేసుల్లో కక్షిదారులు రాజీపడాలని సూచించారు. లోక్ అదాలత్ ద్వారా బాధితులకు సత్వరమే న్యాయం జరుగుతుందని సీపీ తెలిపారు.

ఫ్యాక్టరీ అనుమతులు రద్దు చేసే వరకూ ఉద్యమిస్తాం

- సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లారెడ్డి



గుగ్గిళ్లలో గ్రామస్థులతో మాట్లాడుతున్న మల్లారెడ్డి

బెజ్జంకి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మాణ అనుమతులను రద్దుచేసే వరకూ ఉద్యమిస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి అన్నారు. మండలంలోని తిమ్మాయపల్లి, నరసింహులపల్లి గ్రామ శివారులో నిర్మిస్తున్న ఇథనాల్ ఫ్యాక్టరీకి సమీప గ్రామాలైన గుగ్గిళ్ల, తిమ్మాయపల్లి, నరసింహులపల్లి, పోతారం గ్రామాల్లో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు మంగళవారం పర్యటించి గ్రామస్థులతో మాట్లాడారు. ఫ్యాక్టరీ నిర్మాణం పూర్తయితే భవిష్యత్తులో ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. భూసారం దెబ్బతినడంతోపాటు పంటలు పండకుండాపోతాయని పేర్కొన్నారు. ప్రజల నుంచి నిరసనలు వెల్లువెత్తినా కంపెనీ యజమాన్యం మాత్రం పట్టించుకోకుండా పనులు చేస్తున్నదన్నారు. అధికారులు గ్రామాల్లో పర్యటించి ప్రజల అభిప్రాయాలు తెలుసుకుని దిలావర్‌పూర్ మాదిరిగా ఇక్కడ కూడా ఫ్యాక్టరీ అనుమతులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గోపాలస్వామి, శశిధర్,మండల కార్యదర్శి శ్రీనివాస్, కమిటీ సభ్యులు ప్రశాంత్, సాయికృష్ణ, ఎల్లయ్య, అరవింద్, గ్రామస్థులు పాల్గొన్నారు.

'కందిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి'

జగదేవ్‌పూర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కంది పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి వసంతరావు సూచించారు. మండలంలోని దౌలాపూర్‌లో రైతు వంటేరు సంజీవరెడ్డి ఆయిల్‌పామ్ తోటలో అంతర పంటగా సాగుచేసిన కంది పంటను మంగళవారం సందర్శించారు. కంది పంట కాత, పూత దశలో ఉందని, కాయ తొలిచే మారుకా మచ్చల పురుగు, శనగపచ్చ పురుగును అక్కడక్కడ గమనించామని, రైతులు సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు.

ఏడాదైనా.. ఎదురుచూపులే

5వ పేజీ తరువాయి..

కొత్త కమిటీని ప్రకటించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి, సిద్దిపేట, దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జులు పూజల హరికృష్ణ, చెరుకు శ్రీనివాస్‌రెడ్డి, మైనారిటీ కోటాలో సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్, ఎస్సీ కోటాలో బొమ్మల యాదగిరి, బీసీ వర్గానికి చెందిన దరిపల్లి చంద్రం చైర్మన్ స్థానాన్ని ఆశిస్తున్నారు. వీరితోపాటు సీనియర్ కాంగ్రెస్ నేతలైన శివప్ప, నాయిని నర్సింహారెడ్డి, గంప మహేందర్, తాడూరి శ్రీనివాస్‌గౌడ్, హుస్నాబాద్‌కు చెందిన మహిళా నేత కర్నకంటి మంజులారెడ్డి పేర్లు వినబడుతున్నాయి. బీఎస్పీ అభ్యర్థిగా బరిలోకి దిగి తర్వాత కాంగ్రెస్‌లో చేరిన చక్రధర్‌గౌడ్ సైతం 'సుడా' చైర్మన్‌గిరి కోసం ప్రయత్నిస్తున్నారు. పార్టీ కోసం కష్టపడినవారికే స్థానం కల్పించాలని ఒక వర్గం కోరుతుండగా, కొత్త, పాత తేడా లేకుండా సీనియర్లకు పదవులు ఇవ్వాలని మరో గ్రూపు తయారవుతున్నది.

ఎవరి గ్రూపు వారిదే

కాంగ్రెస్‌లో గ్రూపుల లొల్లి తారాస్థాయికి చేరింది. ఇటీవల సాక్షాత్తు సీఎం రేవంత్‌రెడ్డి కళ్లముంగిటే గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి, మరో నేత బండారు శ్రీకాంత్‌రావు వర్గాల నడుమ బాహాబాహీ జరిగిన విషయం తెలిసిందే. ప్రస్తుతం జిల్లా కాంగ్రెస్ నేతలు అనేక గ్రూపులుగా విడిపోయారు. నేరుగా సీఎం రేవంత్‌రెడ్డితో పాత, కొత్త సంబంధాలున్న నాయకులు ఆదే దారిలో ధీమాతో ఉన్నారు. అదే విధంగా ఉమ్మడి జిల్లా మంత్రి దామోదర రాజనర్సింహ, సిద్దిపేట జిల్లాకు చెందిన మంత్రి పొన్నం ప్రభాకర్, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ ఆశీస్సుల కోసమూ గ్రూపులు కడుతున్నారు. ఇక టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావుకు జిల్లాలో ప్రత్యేక అనుచరగణం ఉంది. అంతేగాకుండా టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, శ్రీధర్‌బాబులనూ నమ్ముకున్నవారు లేకపోలేదు. ఇలా ఎవరికి వారే తమ ఆధిపత్యాన్ని ప్రదర్శించే ప్రయత్నంలో పదవులపై ఊగిసలాట నెలకొంటున్నది. అందుకే ఏడాది గడిచినా పదవుల పంపకం ముందుకు సాగడం లేదనే వాదన వినిపిస్తోంది.

ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ కాంప్లెక్స్ బిల్డింగ్ పనులు పూర్తిచేయాలి



ఐవోసీ భవనం ఆవరణలో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

చేర్యాల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): చేర్యాల పట్టణంలో అర్ధాంతరంగా నిలిచిపోయిన ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ కాంప్లెక్స్ బిల్డింగ్ పనులు వెంటనే పూర్తిచేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఐవోసీ భవన ఆవరణలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కొంగరి వెంకట్‌మావో మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాలన్నీ ఒకేచోట కొనసాగించాలనే ఉద్దేశంతో రూ.17 లక్షలతో చేపట్టిన పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయన్నారు. ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి చొరవ వహించి త్వరితగతిన పనులు పూర్తిచేయించి అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బండకింది అరుణ్‌కుమార్, రాళ్లబండి నాగరాజు, ముస్త్యాల ప్రభాకర్, బోయిని మల్లేశం, ఇప్పకాయల శోభ, తొండంగల రామచంద్రం, రాళ్లబండి చందు, తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలను పరిష్కరించాలి

- సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అందె అశోక్

మద్దూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యలను పరిష్కరించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అందె అశోక్ కోరారు. మంగళవారం తహసీల్దార్ రహీంను కలిసి పలు రెవెన్యూ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ చాలాఏళ్ల క్రితం పేద రైతులు భూస్వాముల నుంచి భూములు కొనుగోలు చేసి సాదాబైనామా కాగితాలు రాయించుకున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి రైతులకు పట్టాలు అందేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమితి సభ్యులు ఈరి భూమయ్య, మండల కార్యదర్శి జంగిలి యాదగిరి, కామిడి సురేందర్‌రెడ్డి, వంగపల్లి వెంకటయ్య పాల్గొన్నారు.

పాడి, కోళ్ల పెంపకం చేపట్టాలి

- లోడి సాంఘిక సేవా సంస్థ ప్రాజెక్టు కోఆర్డినేటర్ బాలశౌరి



అక్కన్నపేట మండలంలోని పంచరాయితండాలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ప్రాజెక్టు కోఆర్డినేటర్ బాలశౌరి

అక్కన్నపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రైతులు వ్యవసాయంతో పాటు అధిక ఆదాయం కోసం పాడి, కోళ్ల పెంపకం చేపట్టాలని లోడి సాంఘిక సేవా సంస్థ ప్రాజెక్టు కోఆర్డినేటర్ బాలశౌరి సూచించారు. మంగళవారం అక్కన్నపేట మండలంలోని పంచరాయితండాలో గడ్డి విత్తనాల పెంపకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి గేదెలు, ఆవులు పెంపకం కోసం పశుగ్రాసం అవసరం ఉంటుందని, అందుకోసం గడ్డి విత్తనాలను నాటుకోవాలని పేర్కొన్నారు. పాడి పశువులకు, కోళ్లకు వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండి టీకాలు వేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ఫీల్డ్ కోఆర్డినేటర్ కోడం సత్యనారాయణ, ప్రతినిధులు కనకం రవీందర్, భూక్య బిచ్చ, ముదవతు తిరుపతి, పెల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశలోనే జీవిత లక్ష్యాన్ని ఎంచుకోవాలి



మాట్లాడుతున్న గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ సైదా

గజ్వేల్/దుబ్బాక, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశలోనే జీవిత లక్ష్యాన్ని ఎంచుకోవాలని గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ సైదా, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మురళీ సూచించారు. గజ్వేల్ పట్టణంలోని విశ్వతేజ జూనియర్ కళాశాలలో మంగళవారం వారు మహిళల రక్షణకు గల చట్టాలు, సైబర్ నేరాలు, గుడ్, బ్యాడ్ టచ్, సోషల్‌మీడియా, సెల్‌ఫోన్, మైనర్ డ్రైవింగ్, రోడ్డు ప్రమాదాల నివారణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. వారి వెంట ప్రిన్సిపల్ చిన్నరాములు, గజ్వేల్ షీటీమ్ బృందం సభ్యులు ఉన్నారు. అలాగే దుబ్బాక మండలం రామక్కపేట బాలికల గురుకుల పాఠశాలలో ఎస్ఐ గంగరాజు సైబర్‌నేరాల పట్ల విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రొబేషనరీ ఎస్ఐ మానసతోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

మిరుదొడ్డిలో పండుగ సాయన్న వర్ధంతి

మిరుదొడ్డి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన మిరుదొడ్డిలో మంగళవారం పండుగ సాయన్న ముదిరాజ్ వర్ధంతిని ఆ సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాయన్న చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.



హుస్నాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఉన్న ఆశా కార్యకర్తలకు సంఘీభావం తెలుపుతున్న బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు

ఆశ కార్యకర్తల ముందస్తు అరెస్ట్

హుస్నాబాద్/రాయపోల్/మద్దూరు/సిద్దిపేట రూరల్/కోహెడ/దుబ్బాక/మిరుదొడ్డి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని పోలీస్ కమిషనరేట్ కార్యాలయాన్ని ముట్టడించేందుకు వెళ్తున్నారని సమాచారం మేరకు మంగళవారం హుస్నాబాద్‌లోని ఆశా కార్యకర్తలను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పోలీస్‌స్టేషన్‌లో ఉన్న ఆశా కార్యకర్తలను బీఆర్ఎస్ నాయకులు కలిసి సంఘీభావం తెలిపారు. ఇందులో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకులరజిత, వైస్ చైర్మన్ అయిలేని అనిత, నాయకులు ఆకుల వెంకట్, సుద్దాల చంద్రయ్య, ఐలేని మల్లికార్జున్ రెడ్డి, కౌన్సిలర్ బొజ్జ హరీష్ తదితరులున్నారు. రాయపోల్‌లో ఆశావర్కర్లు యాదమ్మ, భాగ్యలక్ష్మి, రజిత, కవిత, జ్యోతిని అదుపులోకి తీసుకున్నారు. మద్దూరులో పాకాల జయ, కొండ మణెమ్మ, మంజుల, బాబాయి, ప్రవళిక, కమలమ్మ, రజితను అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఆలేటి యాదగిరి మాట్లాడారు. ఆశాలను అరెస్ట్ చేయడం దుర్మార్గమని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి తునికి మహేష్ అన్నారు. సిద్దిపేటలో ఆశాల అరెస్టును తీవ్రంగా ఖండించారు. కోహెడ మండలంలో ఆశా కార్యకర్తలు కొంకటి అశ్విని, వెల్దండి కవిత, మొగురం పద్మ, పుష్ప, వసంత, జ్యోతి, లావణ్య అరెస్టయ్యారు. ఆశాల అక్రమ అరెస్టు అప్రజాస్వామికమని ఆశా కార్యకర్తల అధ్యక్షురాలు దష్మెడ రజిత అన్నారు. దుబ్బాక, మిరుదొడ్డి మండలాల్లోని ఆశాకార్యకర్తలు స్వరూప, దుబ్బాక సంతోష, చంద్రకళ, రేణుక, కవిత, ఇందిరను పోలీసులు అరెస్టు చేసి దుబ్బాక, మిరుదొడ్డి, అక్బర్‌పేట-భూంపల్లి మండలాల్లోని పోలీస్‌స్టేషన్లకు తరలించారు.



రాయపోల్ పోలీసుల అదుపులో ఉన్న ఆశావర్కర్లు



గజ్వేల్ పట్టణంలోని పాత తెలంగాణ తల్లి విగ్రహం వద్ద నాయకులు

తెలంగాణ తల్లి రూపాన్ని మార్చడం అనైతిక చర్య

గజ్వేల్/హుస్నాబాద్ టౌన్/మద్దూరు/చిన్నకోడూరు/బెజ్జంకి/చేర్యాల/సిద్దిపేట రూరల్/దుబ్బాక/మిరుదొడ్డి/అక్కన్నపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ తల్లి రూపాన్ని మార్చడం అనైతిక చర్య అని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ అధిష్ఠానం ఆదేశాల మేరకు గజ్వేల్ పట్టణంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి వారి ఆధ్వర్యంలో క్షీరాభిషేకం నిర్వహించారు. వారి వెంట మునిసిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, మాజీ ఏఎంసీ చైర్మన్ శ్రీనివాస్, పట్టణాధ్యక్షుడు నవాజ్‌మీరా, పార్టీ మండలాధ్యక్షుడు బెండే మధు తదితరులున్నారు. హుస్నాబాద్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో బీఆర్ఎస్ నాయకులు గత తెలంగాణ తల్లి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ సుద్దాల చంద్రయ్య ఉన్నారు. మద్దూరు మండలం లద్నూరులో నాయకులు క్షీరాభిషేకం నిర్వహించారు. చిన్నకోడూరులో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ ఆధ్వర్యంలో నాయకులు క్షీరాభిషేకం చేశారు. బెజ్జంకి మండలం గుండారంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పాకాల మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. చేర్యాల, కొమురవెల్లి మండలాల్లో బీఆర్ఎస్ నాయకులు తెలంగాణ తల్లి విగ్రహాలకు క్షీరాభిషేకం చేశారు. సిద్దిపేట రూరల్, నారాయణరావుపేట మండలాల్లోని పలు గ్రామాల్లో క్షీరాభిషేకం చేశారు. దుబ్బాక, మిరుదొడ్డి, అక్బర్‌పేట-భూంపల్లి మండలాల్లోని తెలంగాణ తల్లి విగ్రహాలకు బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు రొట్టె రాజమౌళి, జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్లారెడ్డి, మిరుదొడ్డి, అక్బర్‌పేట-భూంపల్లి మండల అధ్యక్షుడు అంజిరెడ్డి, జిడిపల్లి రవి క్షీరాభిషేకం చేశారు. అక్కన్నపేట మండలంలో బీఆర్ఎస్ మండలశాఖ ఆధ్వర్యంలో తెలంగాణ తల్లి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఇందులో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పెసరు సాంబరాజు, మాజీ జడ్పీటీసీ మాలోతు బీలునాయక్ తదితరులున్నారు.



చిన్నకోడూరులో తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు